రోడ్ల సమస్యలకు చెక్

- ముమ్మరంగా రహదారి పనులు
- రూ. 75 కోట్లు వెచ్చించి నిర్మాణం



నిర్మాణంలో ఉన్న కాళీపట్నం- పాతపాడు రహదారి

మొగల్తూరు: నియోజకవర్గంలోని ప్రధాన రహదారుల సమస్యలకు చెక్ పడనుంది. చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు గతంలో తీరప్రాంత గ్రామాల్లోని పుంత రోడ్లను జాతీయ విపత్తు నివారణ పథకంలోని నిధులతో అభివృద్ధి చేశారు. అంతేకాక నియోజకవర్గంలోని గ్రామాలపై పూర్తి అవగాహన ఉండడంతో అభివృద్ధి పనులు చేపట్టడంలో ముందున్నారు. ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ప్రసాదరాజు ప్రధాన రహదారులుపై దృష్టి సారించారు. మొగల్తూరు మండలంలో చేపట్టిన రహదారి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే సగం రోడ్డు నిర్మాణాలు పూర్తి చేసుకోగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

రూ.75 కోట్లతో పనులు

నరసాపురం, మొగల్తూరు మండలాల్లో సుమారు 95 కిలో మీటర్ల రహదారులను రూ.75 కోట్లతో అభివృద్ధి పరుచనున్నారు. ఇప్పటికే కొన్ని రహదారుల పనులు ప్రారంభం కాగా మరికొన్ని నిర్మాణంలో ఉన్నాయి. ప్రత్యేక నిధులు రూ.2 కోట్లతో చేపట్టిన లిఖితపూడి–మల్లవరం, పెదలంక రోడ్డు పనులు, రూ.1.70 కోట్లతో చేపట్టిన పసలదీవి–రామన్నపాలెం, లక్ష్మణేశ్వరం నుంచి పీఎంలంక రూ.20 కోట్లు, నరసాపురం టౌన్ నుంచి కరింశెట్టి వారి మెరక వయా లక్ష్మణేశ్వరం, సారవ రూ7 కోట్లు, బియ్యపుతిప్ప మోళ్లపర్రు వయా వేములదీవి, పీఎంలంక రూ.4.30 కోట్లు, నరసాపురం పితానివారి మెరక వయా లక్ష్మణేశ్వరం, వైఎస్‌పాలెం, రామన్నపాలెం రూ.2.70 కోట్లతో చేపట్టిన పనులు పూర్తయ్యాయి. ముత్యాలపల్లి, మోళ్లపర్రు వయా మోడి, పేరుపాలెం రూ.28 కోట్ల చేపట్టిన పనుల్లో ముత్యాలపల్లి నుంచి మోడి వరకూ సీసీ రోడ్డు పూర్తి కాగా మోడి నుంచి పేరుపాలెం సెంటర్ వరకూ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. కొత్తోట, కోమటితిప్ప, దెయ్యాలతిప్ప, జిల్లేడుతిప్ప, నీటితిప్ప వయా వెంప, కాళీపట్నం,రూ.9 కోట్లతో చేపట్టిన పనులోల రెండు రోడ్లు పూర్తికాగా మిగిలిని రోడ్లు నిర్మాణ దశలో ఉన్నాయి. మెట్రేవు, అల్లంవారిమెరక నుంచి పేరుపాలెం బీచ్ వరుకు రూ.8 కోట్లతో రహదారులను అభివృద్ధి జరుగుతుండగా. కాళీపట్నం పడమర నుంచి జగన్నాథపురం వయా పాతపాడు వరకూ రహదారి నిర్మాణంతో పాటు రెండు వరుసల వంతెన నిర్మాణం కోసం మంజూరైన రూ.12 కోట్లతో చేపట్టిన పనుల్లో వంతెన పూర్తికాగా సీసీ రోడ్డు పనులు కాళీపట్నం గ్రామంలోని శివాలయం వరకూ పూర్తయ్యాయి. మొగల్తూరు గాంధీ బొమ్మల సెంటర్ నుంచి బేతపూడి వరుకు వయా వెంప రహదారికి మంజూరైన రూ.12.64 కోట్లతో చేపట్టిన పనుల్లో ఆక్రమణలు తొలగించి రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు.

వివిధ దశల్లో రోడ్ల నిర్మాణాలు



ఇప్పటికే నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో రహదారులు, వంతెనలు నిర్మించాం. ఇటీవల విడుదలైన రూ.75 కోట్లతో సుమారు 95 కిలోమీటర్ల మేర రహదారి పనులను చేపట్టబోతున్నాం. బీచ్‌కు వెళ్లే రహదారులన్నిటినీ అనుసంధానం చేస్తూ చేపట్టిన రోడ్డు పనులు సగం పూర్తి కాగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి.

– ముదునూరి ప్రసాదరాజు, చీఫ్‌విప్

వంతెన నిర్మాణం పూర్తి



మా గ్రామంలో అపరిష్కృతంగా ఉన్న వంతెన నిర్మాణం పూర్తి కాగా రహదారి నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుకు నియోజకవర్గంలోని గ్రామాల్లోని సమస్యలపై అవగాహన ఉండటంతో నిధులు మంజూరుచేసి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవడంతో నిర్మాణపనులు వేగవంతంగా సాగుతున్నాయి.

– దొంగ నాగముని, సొసైటీ చైర్మన్, కాళీపట్నం



ముత్యాలపల్లి నుంచి మోడి వరకూ పూర్తయిన సీసీ రోడ్డు



పూర్తయిన మొగల్తూరు కొండావారి పాలెం రహదారి



నిర్మాణం పూర్తి చేసుకున్న కెపిపాలెం మొగల్తూరు వయా కొత్తకాయలతిప్ప రోడ్డు

క్లుప్తంగా

ఇతరులకు సాయపడాలి



ప్రార్థనలు చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: ఇతరులకు సాయం చేయాలనే బృహత్తర లక్ష్యం పవిత్ర పంజాన్ పండుగ సారమని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పట్టణంలోని అంజుమన్‌భవన్‌లో మంగళవారం ముస్లిం సోదరులు ఇచ్చిన ఇఫ్తార్ విందులో ముదునూరి పాల్గొన్నారు. మత గురువులతో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ నరసాపురం ప్రాంతంలో వందల ఏళ్లనాటి దర్గాలు ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో ముస్లిం సోదరులు పలు సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో మమేకమయ్యారని చెప్పారు. అంజుమన్ సంఘ అధ్యక్షుడు షేక్ ఖలిమస్తాన్ మాట్లాడుతూ ముస్లింల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు.

పాలకొల్లులో పోలీసుల కవాతు



కవాతు అనంతరం సమావేశంలో మాట్లాడుతున్న పోలీసులు

పాలకొల్లుసెంట్రల్: ప్రస్తుతం జరగనున్న అసెంబ్లీ, పార్లమెంటు సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని పట్టణ సీఐ కె. మంగాదేవి అన్నారు. మంగళవారం పట్టణంలో రైల్వేగేటు సెంటర్, హౌసింగ్‌బోర్డు కాలనీ, కొత్తపేట, రామారావు పేట, సుబ్బారాయుడు గుడి, బెత్లహంపేట, సలాదివారి తోట ప్రాంతాల్లో పోలీసులు సీఐఎస్ఎఫ్ సిబ్బందితో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా బెత్లహంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరుగుతాయన్నారు. ప్రజలు భరోసా కల్పించే లక్ష్యంతో పట్టణంలో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై బాదం శ్రీనివాసరావు, ఏఎస్సై మార్‌లింగం, మద్దాల శివాజీ పాల్గొన్నారు.

తల్లిదండ్రులకు అవగాహన



పెనుగొండలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రజనీకుమార్

పెనుగొండ: బాల్యం నుంచే తల్లిదండ్రులు వారి చిన్నారులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తుండాలని పెనుగొండ సీఐ నక్కా రజనీకుమార్ అన్నారు. ఈ నెల 21న అనూహ్య సంఘటనలో కొంతమంది యువకులతో కలిసి బాలురు పోలీస్ స్టేషన్‌పై దాడి చేశారని, వారిని అదుపులోకి తీసుకున్నామని వివరించారు. ఆవేశాలకు లోను కాకుండా సమస్యను పోలీసుల దృష్టికి తీసుకువస్తే పరిశీలిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు వారి పిల్లలను అదుపులో ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సై ఎస్‌కే సుభానీ పాల్గొన్నారు.

ధాన్యం సేకరణపై అవగాహన



ఆచంటలో ధాన్యం సేకరణపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: దాళ్వా సాగు ధాన్యం కొనుగోలుపై ఆచంట ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం ధాన్యం కొనుగోలు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఏప్రిల్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరుగుతుందని తహసీల్దారు ఐపీ శెట్టి వివరించారు. 17 శాతం తేమ మించకుండా రైతులు కోతలు పూర్తకాగానే ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రానికి చేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.నరసింహ, ఎంఎల్ఓ ఇస్మాయేల్, వ్యవసాయాధికారి బి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.8.97 లక్షలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని శ్రీదంతులూరి జగన్నాథరాజు సత్రం అనుబంధ సంస్థ శ్రీపద్మావతి వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో మంగళవారం హుండీల లెక్కింపు చేపట్టారు. 180 రోజులకుగాను రూ.8,97,736 ఆదాయం హుండీల ద్వారా లభించిందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. హుండీ లెక్కింపులో వంశపారంపర్య ధర్మకర్త మంతెన రామ్‌కుమార్, ట్రస్ట్‌బోర్డు సభ్యులు టి.వెంకటేశ్వరరావు, డి.లక్ష్మీ, కర్రి శ్రీనివాసరావు, ఈఓ రుద్రరాజు గంగాశ్రీదేవి, అర్చకులు పాల్గొన్నారు.

పథకాలు కొనసాగాలంటే జగనన్నకు ఓటెయ్యాలి



బాడవలో ఓట్లు అభ్యర్థిస్తున్న గుడాల మంగతాయారు

యలమంచిలి: రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సతీమణి గుడాల మంగతాయారు కోరారు. బాడవ గ్రామంలో మంగళవారం ఆమె ఇంటింటికీ వెళ్లి తన భర్తకు ఓటేయడం ద్వారా జగనన్నను ముఖ్యమంత్రిని చేయాలని కోరుతూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డిది అన్నారు. మోసానికి ప్రతిరూపమైన చంద్రబాబు మాటాలు నమ్మవద్దని ఆమె ఓటర్లను కోరారు. ఆమె వెంట కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఇలపకుర్తి లక్ష్మీ మాజీ సర్పంచ్ ఇలపకుర్తి నరసింహారావు (పండు), పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు వినుకొండ చిన్న, ఏనుగువానిలంక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ రావూరి రామకృష్ణ, జేసీఎస్ నియోజకవర్గ కన్వీనర్ ఉచ్చుల స్టాలిన్, పాలకొల్లు ఏఎంసీ డైరెక్టర్ కల్యాణం గంగాధరరావు ఉన్నారు.

ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

మొగల్తూరు: మండలంలోని పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా సాగుతున్నాయి. మంగళవారం నిర్వహించిన సైన్స్ పరీక్షకు మండలంలోని ఆరు పరీక్షా కేంద్రాల ద్వారా 921 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 865 మంది విద్యార్థులు మాత్రమే హాజరయ్యారని ఎంఈఓ శామ్యూల్ జాన్ తెలిపారు. 56 విద్యార్థులు గైర్హాజరయ్యారని వివరించారు.

మాట నిలుపుకున్న శ్రీరంగనాథరాజు



సోమరాజు చెరువులో మాజీ మంత్రి శ్రీ రంగనాథరాజు ఎత్తుకుని జేజేలు కొడుతున్న దృశ్యం

పెనుగొండ: మండలంలోని సోమరాజు చెరువులో మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు మంగళవారం రాత్రి ప్రచారం నిర్వహించారు. మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు 2019 ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి సోమరాజు చెరువును ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయడంతో పాటు, పంచాయతీ భవన నిర్మాణం పూర్తి చేయించడంతో సోమరాజు చెరువు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచారం ప్రారంభించిన అనంతరం రోజురోజుకు బీసీ గ్రామాల్లో శ్రీరంగనాథరాజు ఎనలేని ఆదరణ పెరుగుతూ వస్తుంది. దీనికి తోడు మాట నిలుపుకోవడం సోమరాజు చెరువు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు.కార్యక్రమంలో కార్యక్రమాల్లో వైస్ ఎంపీపీలు పాలపర్తి సుబ్రహ్మణ్యం, తోలేటి శ్రీనులు, జిల్లా ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు, సొసైటీ అధ్యక్షుడు కోళ్ల గోవిందరావు, జిల్లా కార్యదర్శి కాకిలేటి బాపిరాజు, దంపనబోయిన భోగేశ్వరరావు, దంపనబోయిన నాగరాజు, మల్లుల సత్యనారాయణ, నున్న పెద్దబ్బులు, దంపనబోయిన గజపతి, నున్నబోయిన సుబ్రహ్మణ్యం, కొమ్మిరెడ్డి త్రిమూర్తులు, శేషమ్మ చెరువు పార్టీ అధ్యక్షుడు జక్కంశెట్టి శివ పాల్గొన్నారు.

ఉపాధి హామీ ద్వారా పని దినాలు కల్పించాలి



మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకులు

పాలకొల్లు సెంట్రల్: డెల్టా ప్రాంతంలో దాళ్వాకోతలు వచ్చే వరకూ కార్మికులకు పనులు ఉండవని అలాంటి వారికి ఉపాధి హామీ ద్వారా పనులు కల్పించాలని ఏపి కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి అన్నారు. మంగళవారం స్థానిక పట్టణంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జార్జి మాట్లాడుతూ దాళ్వా కోతలు వచ్చే వరకూ కార్మికులకు పంట కాలువలు, మురుగు కాలువల పనులు కల్పించే విదంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఉపాధి హామీ పనుల్లో పాల్గొనే కార్మికులు అస్వస్థతకు గురై ప్రాణాలు కోల్పోయే వారికి ప్రభుత్వం నష్ట పరిహారం అందించే విదంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కవురు పెద్దిరాజు, బల్ల చిన వీరభద్రరావు, యడ్ల చిట్టిబాబు, కండెల్లి సోమరాజు, శేషపు ఆశ్రయ్య, జె.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వైద్యనాథేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



పెనుమర్రు శివాలయం వద్ద కాషాయ చీరలు ధరించి భోజనాలు వడ్డిస్తున్న మహిళలు

యలమంచిలి: పెనుమర్రు గ్రామంలోని శ్రీ ఉమా వైద్యనాథేశ్వరస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం రాత్రి జరిగిన అన్నసమారాధనతో ముగిశాయి. మహిళలంతా కాషాయ చీరలు ధరించి భోజనాలు వడ్డించారు. ఈ నెల 21న యాజ్ఞిక బ్రహ్మ బాదంపూడి చిరంజీవిశర్మ బ్రహ్మత్వంలో ఆలయ అర్చకులు బాదంపూడి వరప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో దేవేరుల కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాత పొత్తూరి సోమరాజు, వెంకట సుబ్బలక్ష్మి దంపతులు పీటలపై కూర్చుని ఈ కల్యాణం నిర్వహించారు. కల్యాణోత్సవాలలో భాగంగా ప్రతి రోజూ ఉదయం స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. విశిష్టంగా పంచదారాభిషేకం, రథోత్సవం, జ్యోతి లింగార్చన, గ్రామ బలిహరణ, త్రిశూల స్నానం, వసంతోత్సవం, పుష్పోత్సవం నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ సతీష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి రానివ్వద్దు



పంచాయతీ కార్యదర్శులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు

యలమంచిలి: వేసవిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి రానివ్వకుండా పంచాయతీ కార్యదర్శులంతా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఎస్ శ్రీనివాసరావు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన వేసవిలో తాగనీటి ఎద్దడి రానివ్వకుండా తీసుకోవాలని నివారణ చర్యలపై పంచాయతీ కార్యదర్శులతో చర్చించారు. కాలువలు కట్టివేసే ముందు చెరువులకు తాగునీరిస్తారని ఆ సమయానికి చెరువుల్లో కనీసం 40 శాతం నీరు ఉండేలా ఇప్పుడే చర్యలు తీసుకోవాలన్నారు. చెరువులకు సాగునీరిచ్చిన సమయంలో పూర్తిస్థాయిలో నింపాలన్నారు. పైపులైన్ లీకేజీలు, కుళాయి లీకేజీలు ఉంటే వాటర్ ట్యాంకుల ద్వారా పంపిణీ చేసిన నీరు వృథా అవుతుందని, అందువల్ల లీకేజీలు ఉంటే వెంటనే మరమ్మతులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మద్రిపూడి సురేష్‌బాబు, ఈఓపీఆర్డీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



మొగల్తూరు జాతీయ రహదారిలో తనిఖీ చేస్తున్న చెక్ పోస్టు సిబ్బంది

నరసాపురం రూరల్: ఎన్నికల్లో డబ్బు పంపిణీకి చెక్ పెట్టేందుకు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. దీంతో నరసాపురం నియోజకవర్గంలోకి అడుగు పెట్టాలంటే జాతీయ రహదారిపై మొగల్తూరు, రుస్తుంబాద, చిట్టవరం ప్రాంతాలతో పాటు పంటు రేవులోనూ ఏర్పాటు చేసిన చెక్ పోస్టులను దాటాల్సి ఉంది. అయితే కనీస అవగాహనలేక ఆధారాలు లేకుండా నగదు పట్టుకెళ్లే వ్యాపారులు, బ్యాంకర్లు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై ఫ్లయిగ్ స్క్వాడ్ సిబ్బంది మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో తనిఖీలు ఉన్న దృష్ట్యా డబ్బు, నగదు రవాణా చేయాల్సి వస్తే ఆధారాలు వెంట తీసుకెళ్లాల్సి ఉంటుందన్నారు. మంగళవారం మొగల్తూరు మండలం రామన్నపాలెం జాతీయ రహదారిపై ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో టీం లీడర్ ఎం శాంతి మౌనిక, ఏఎస్సై రాంజేంద్ర పాల్గొన్నారు.

రాజకీయ కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి

ఉండి: జిల్లాలో సార్వత్రిక ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున ఎన్నికల కార్యక్రమాల్లో భాగంగా అభ్యర్థులు,రాజకీయ పార్టీలు, నాయకులు నిర్వహించే ఇంటింటి ప్రచారాలు, రోడ్‌షోలు, ర్యాలీలు, సభలు, సమావేశాలకు తదితర కార్యక్రమాలకు ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి సీవీ ప్రవీణ్ ఆదిత్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల నియమావళిని అనుసరించి ఎన్నికల ప్రక్రియలో భాగంగా నిర్వహించే ఊరేగింపులు, ర్యాలీల్లో వాడే స్పీకర్లకు, స్పీకర్లతో కూడిన వాహనాలకు,కరపత్రాల పంపిణీకి, రాజకీయ పార్టీల కార్యాలయాల ప్రారంభోత్సవాలకు, ప్రచార వాహనాలకు, సమావేశ ప్రాంతాల్లో ఫ్లెక్సీలు, బారికేడ్లు, ఏర్పాటు చేసేందుకు 48 గంటల ముందుగానే సువిధ యాప్ ద్వారా లేదా నేరుగా దరఖాస్తు చేసుకుని తప్పనిసరిగా అనుమతి పొందాలని జేసీ సూచించారు. ఈ విషయాన్ని అన్ని పార్టీల నాయకులు గమనించాలని కోరారు.

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన ఎస్పీ



స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ వి.అజిత

భీమవరం: ఎన్నికల అనంతరం ఈవీఎంలను భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌లు, లెక్కింపు కేంద్రాల వద్ద బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ వి.అజిత మంగళవారం పరిశీలించారు. భీమవరంలోని ఎస్ఆర్‌కేఆర్, విష్ణు విద్యా సంస్థలను ఆమె పరిశీలించి మాట్లాడారు. లెక్కింపు కేంద్రాల వద్ద ఏర్పాటు చేయాల్సిన భద్రతపై అధికారులకు ఆదేశాలిచ్చారు. సీసీ కెమెరాల ఏర్పాటుపై సూచనలు చేశారు. అదనపు ఎస్పీలు బి.భీమారావు, ఏటీవీ రవికుమార్, డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు మొగల్తూరులో ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచారం

మొగల్తూరు: గ్రామంలో బుధవారం ప్రజాశీర్వాద ఎన్నికల ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కుక్కల కృష్ణమోహన్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మొగల్తూరు గ్రామంలోని కడలివారి పాలెం రామాలయం నుంచి ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారన్నారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

లంకలకోడేరు గ్రేడ్-1 కార్యదర్శిగా రాజేష్‌కుమార్

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా కానూరి రాజేష్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రాజేష్‌కుమార్ గ్రేడ్ -2 పంచాయతీ కార్యదర్శిగా పాలకోడేరు మండలం గరగపర్రు పని చేశారు. గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా పదోన్నతి పొందారు. విధుల్లో చేరిన రాజేష్‌కుమార్‌ను గ్రామ సర్పంచ్ చొప్పల రజని, సచివాలయ సిబ్బంది అభినందించారు.

నేడు వేడంగిపాలెంలో గుడాల గోపి ప్రచారం

పోడూరు: పాలకొల్లు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల గోపి బుధవారం ఉదయం 8 గంటల నుంచి వేడంగిపాలెం గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పితాని చిన్నా మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రచార కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు పాల్గొనాలని కోరారు.

ఎన్నికల ప్రచారానికి అనుమతి తప్పనిసరి

పెనుగొండ: సార్వత్రిక ఎన్నికల ప్రచారానికి ఎన్నికల ప్రవర్తన నియమావళి అనుసరించి తప్పని సరిగా అనుమతులు తీసుకోవాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల అధికారి వి.స్వామి నాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటింటి ప్రచారం, రోడ్డు షోలు, సభలు, సమావేశాల కోసం 48 గంటల ముందు అనుమతులు తీసుకోవాలన్నారు. ప్రార్థన మందిరాలు, విద్యా సంస్థల దగ్గర ఎలాంటి ప్రచార కార్యక్రమాలు చేయరాదన్నారు. అలాగే కుల, మత, వర్గపరమైన రెచ్చగొట్టే ప్రసంగాలు చేయకూడదన్నారు. మిగిలిన వివరాలకు సువిధ టీం అధికారి పూర్ణబాబ్జీ నెంబర్ 99635 90272కు ఫోన్ చేయాలని సూచించారు.

వైభవంగా రామాలయ ప్రతిష్ఠాపనోత్సవాలు



రామాలయ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ప్రారంభిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుగొండ: మునమర్రులో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలను మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు దంపతులు ప్రారంభించారు. ఉదయం నుంచి ఆలయ అర్చకులు గణపతి పూజ, పుణ్యాహవచనం నిర్వహించి పూజా మహోత్సవాలు ప్రారంభించారు. మూడు రోజుల పాటు హోమాలు, ప్రతిష్ఠాపన పూజలు, నవగ్రహ శాంతి పూజలు, వాస్తు పూజలు నిర్వహించిన అనంతరం ఈ నెల 28న విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ తోట వెంకట సత్యనాగరత్నం మెహర్‌లు, ధర్నాల సూర్యారావు, బొబ్బిలి రాముడు, ఏడిద రాంబాబు, ఏడిద పార్థసారథి, అడ్డగర్ల చంద్రశేఖర్, అడ్డగర్ల మెహర్ దాసు, బొబ్బిలి బాలాజీ పాల్గొన్నారు.

కుల వ్యవస్థల కారణంగానే అసమానతలు



ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక సమాచార బులెటిన్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: సమాజంలోని కుల వ్యవస్థల కారణంగానే అంటరానితనం నిమ్న కులాలను బలహీనపర్చిందని, దీనివల్ల సమాజంలో అంతరాలు, సామాజిక అసమానతలు పెరిగాయని ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గరికిముక్కు సుబ్బయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం భీమవరం బార్ అసోసియేషన్ ఆవరణలో అసోసియేషన్ అధ్యక్షుడు ఎం వెంకటరమణరావు చేతుల మీదుగా ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక సమాచార బులెటిన్ ఆవిష్కరణ సందర్భంగా సుబ్బయ్య మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఫలాలు అన్ని ఉపకులాలకు ఇంకా చేరాల్సివుందన్నారు. దళిత వర్గాల్లో విద్యావకాశాలు, ఉద్యోగుల సంఖ్య, రాజకీయ నాయకత్వం, సామాజిక, రాజకీయం చైతన్యం ఇంకా పెరగాలన్నారు. చింక వెంకటసూర్యనారాయణ అధ్యక్షత వహించిన దాసరి మురళీకృష్ణ, జవ్వాది సత్తిబాబు, సంధి మాణిక్యాలరావు, గూడూరి సాంబమూర్తి, గుంటి ప్రభు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలు



లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

భీమవరం: ఆపదలో ఉన్నవారిని ఆదుకునేందుకు లయన్స్ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు అన్నారు. మంగళవారం భీమవరం లయన్స్ క్లబ్ విజిట్ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. మునిసిపల్ స్కూల్లో విద్యార్థులకు డాక్టర్ మౌనిక పరీక్షల నిర్వహించి కనగర్ల కిషోర్ సహాయంతో సమకూర్చిన మందులను ఉచితంగా అందజేశారు. అలాగే ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పేదలకు గ్రైండర్లు, సైకిళ్లు, దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దాట్ల రామరాజు, నందమూరి రాజేష్, నడింపల్లి మహేష్‌కుమార్ వర్మ, బొండా రామకృష్ణరావు(రాంబాబు) పాల్గొన్నారు.